సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 18 । జనవరి । 2023



మన'సారా' పరివర్తన

నాటుసారా తయారీ, విక్రయదారుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ పథకాల ద్వారా జీవనోపాధి కల్పిస్తోంది. 8లో



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టం రూ.4, సరాసరి రూ.8 పలికింది. మార్కెట్‌కు 350 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/7.9°

జిల్లా పరిధిలో మంగళవారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రూ.6,600 మద్దతు ధరతో కందుల కొనుగోలు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ 2022 సీజన్‌లో పండించిన కందులకు క్వింటాల్ మద్దతు ధరను రూ.6,600గా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్, సీఎం యాప్‌లో నమోదు చేయించుకున్న వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రాలను ఆర్బీకేల్లోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తులు

పుట్టపర్తి టౌన్: నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 లోపు www.novodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3,4 తరగతులు పూర్తి చేసి 01.05.2011-30.04.2013 మధ్య జన్మించిన 5వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ప్రధానోపాధ్యాయులు జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఏప్రిల్ 29న రాత పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ నాగరాజు 9485235387ను సంప్రదించాలని ఆయన సూచించారు.

22న దివ్యాంగుల సమావేశం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఈ నెల 22న దివ్యాంగుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు దివ్యాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు రఫీ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, తెలుగులోకి తర్జుమా చేసిన దివ్యాంగుల హక్కుల చట్టం-2016 పుస్తకాన్ని మంగళవారం కలెక్టర్ బసంత్‌కుమార్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్‌తో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారంపై చర్చించి, భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. సమావేశానికి జిల్లా ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఉద్యోగ విభాగం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వెటరన్ టీటీ చాంపియన్‌షిప్‌కు కదిరివాసి



మహేష్‌కుమార్

కదిరి: ఒమన్ దేశంలోని మస్కట్‌లో జరుగుతున్న ప్రపంచ వెటరన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ 2023 పోటీలకు కదిరికి చెందిన సీనియర్ న్యాయవాది సీవీ క్రిష్ణమూర్తి కుమారుడు సీవీ మహేష్‌కుమార్ ఎంపికయ్యారు. పోటీల్లో ప్రాతినిధ్యం వహించేందుకు దేశం నుంచి ఐదుగురు ఎంపిక కాగా, వారిలో మహేష్‌కుమార్ ఒకరు. రాయలసీమ నుంచి దేశం తరఫున ప్రపంచ వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన మొదటి వ్యక్తి కావడం గమనార్హం. వృత్తి రీత్యా మహేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్అండ్‌టీ టెక్నాలజీస్‌లో ప్రోగ్రాం మేనేజర్‌గా పని చేస్తున్నారు. దేశం తరఫున తన సోదరుడు టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆడటం తనతో పాటు తల్లిదండ్రులకు గర్వంగా ఉందని డా.మదన్‌కుమార్ 'సాక్షి'తో సంతోషాన్ని పంచుకున్నారు.

తపాలా సేవలపై 23 వరకు ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం సిటీ: తపాలా కార్యాలయాల్లో లభించే సేవలకు సంబంధించి ప్రజా ఫిర్యాదులను ఈ నెల 23 వరకు స్వీకరించనున్నట్లు ఆ శాఖ అనంతపురం పీఆర్ఓ ప్రమోద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తపాలా సేవల్లో అలసత్వం, ఇతర సమస్యలతో పాటు తపాలా ఉద్యోగుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులు ఏమైనా ఉంటే కె.సుధీర్‌బాబు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (ఫిర్యాదులు, సంక్షేమం), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ విజయవాడ-520013 కార్యాలయానికి పోస్ట్‌లో పంపాల్సిందిగా కోరారు. పోస్ట్ కవర్‌పై 'డాక్ అదాలత్' అని స్పష్టంగా రాయాలని సూచించారు. ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఫిర్యాది/అర్జీ పరిష్కారం లెటర్/ఈ-మెయిల్ ద్వారా సమాధానాలు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. అర్హతే ప్రామాణికంగా ఫలాలు ఇంటి ముందు వచ్చి వాలుతున్నాయి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి విప్లవాత్మక కార్యక్రమాలతో గ్రామాల స్వరూపమే మారిపోతోంది. దీంతో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ సర్కారుతో కనెక్ట్ అయిపోయారు. ప్రతిపక్షాల ఊసే మర్చిపోతున్నారు. ఎన్నికలకు ఏదాది ముందే జిల్లాలో టీడీపీ అభ్యర్థుల వేటలో నిమగ్నమైన టీడీపీ అధినేత చంద్రబాబుకూ ఈ విషయం బోధపడినట్లు తెలిసింది. ఇప్పటికే పలువురు నాయకులతో సమావేశమై బుజ్జగింపు పర్వాలు మొదలుపెట్టినా.. ఇప్పుడేం చేయలేమని 'తమ్ముళ్లు' సమాధానం ఇచ్చినట్లు సమాచారం.



అసమ్మతి గోల..

అధినేత డీలా!

- ఎన్నికలకు ఏడాది ముందే జిల్లా టీడీపీలో అభ్యర్థుల వేట!
- ఎవరు పోటీ చేస్తారనే దానిపై మాత్రం గందరగోళం
- అన్ని నియోజకవర్గాల్లో వేరుకుంపట్లతో అయోమయం
- చంద్రబాబు అంతర్గత సమావేశాల్లోనూ తేటతెల్లం
- టీడీపీ పరిస్థితి రోజురోజుకూ మరింత ఘోరం

సాక్షి, పుట్టపర్తి: ఏ ముహూర్తాన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు టీడీపీ లేదు.. బొక్కా లేదు అని అన్నాడో తెలియదు కానీ నిజంగానే ఆ పార్టీ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంటోంది. కుదేలైన సైకిల్‌కు ఎన్ని మరమ్మతులు చేసినా ప్రయోజనం కానరావడం లేదు. జిల్లా టీడీపీలో అసమ్మతి మంటలు రగులుతూనే ఉన్నాయి. నిత్యం ఏదో ఒక చోట ఎవరో ఒకరు ఆ పార్టీ అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపిస్తూనే ఉన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే దానిపై స్పష్టత లేదు. కేవలం ఉనికి కాపాడుకునేందుకు నేతలు యత్నిస్తున్నారు. పార్టీ పరిస్థితులను చక్కదిద్దేందుకు చంద్రబాబు నానా తంటాలు పడుతున్నట్లు సమాచారం. అయితే పరిస్థితి చేయి దాటిపోయిందని.. ఇప్పుడేం చేయలేమని 'తమ్ముళ్లు' సమాధానం ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధినేతతో అమీతుమీ..!

టికెట్ రాని పక్షంలో అధిష్టానంతో అమీ తుమీ తేల్చుకుంటామని కొందరు నేతలు ఇప్పటికే సిద్ధమయ్యారు. పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, రాప్తాడు, హిందూపురం, కదిరి నుంచి టీడీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారనే దానిపై స్పష్టత లేదు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు పోటీలో ఉన్నారు. 'పోటీ చేసేది నేనే' అంటూ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండ నుంచి బీకే పార్థసారథి, పుట్టపర్తి నుంచి పల్లె రఘునాథరెడ్డి, కదిరి నుంచి కందికుంట వెంకట ప్రసాద్, హిందూపురం నుంచి బాలకృష్ణ, ధర్మవరం నుంచి పరిటాల శ్రీరామ్, రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేస్తున్నట్లు ఎవరికి వారు చెప్పుకొంటున్నారు. కానీ ఇందులో ఏ ఒక్కరికి కూడా టికెట్ గ్యారెంటీ లేదు. ప్రతి నియోజకవర్గంలో అసమ్మతి నేతల బెడద వెంటాడుతోంది.

సీనియర్స్ వర్సెస్ జూనియర్స్

పెనుకొండలో సవితమ్మ, నిమ్మల కిష్టప్ప, బీకే పార్థసారథి టికెట్ రేసులో ఉన్నారు. పుట్టపర్తి నుంచి పల్లె రఘునాథరెడ్డి, సైకం శ్రీనివాసరెడ్డి, కదిరి నుంచి అత్తార్ చాంద్‌బాషా, కందికుంట వెంకట ప్రసాద్, ధర్మవరం నుంచి పరిటాల శ్రీరామ్‌తో పాటు బీజేపీ నేత వరదాపురం సూరి, పొత్తు కుదిరితే జనసేన నుంచి చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా పోటీలో ఉండనున్నట్లు తెలిసింది. రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేస్తారా? లేక తనయుడిని బరిలో దింపుతారా? అనేది తెలీదు. ధర్మవరం టికెట్ రాకుంటే రాజీనామా చేస్తానని పరిటాల శ్రీరామ్ సవాల్ విసిరిన సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సీనియర్ వర్సెస్ జూనియర్స్ చందంగా టీడీపీ నేతల మధ్య కోల్డ్ వార్ తారస్థాయికి చేరింది. ఒకరితో ఒకరి పోరుతో జిల్లాలో చాలా మంది కీలక టీడీపీ నేతల రాజకీయ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే కొందరు కనుమరుగు కాగా.. మరికొందరు అదేబాటలో నడుస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా.. నేతల వేరుకుంపట్లతో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు కూడా తలోబాట పట్టినట్లు తెలుస్తోంది.

గజగజ @ 7.9 డిగ్రీలు

అనంతపురం అగ్రికల్చర్: కొన్ని రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లావాసులు గజగజ వణికిపోతున్నారు. ఈనెల రెండో వారం నుంచి చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల్లోపే నమోదు అవుతుండటంతో చలితీవ్రత బాగా పెరిగింది. ముఖ్యంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. మంగళవారం కూడా శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో 7.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 9.7 డిగ్రీలు కనిష్టం నమోదైంది. అగళి 8.3 డిగ్రీలు, రొద్దం, తలుపుల 9.8 డిగ్రీలు, గాండ్లపెంట, కనగానపల్లి, వజ్రకరూరు 10 డిగ్రీలు, రాప్తాడు 10.2 డిగ్రీలు, సోమందేపల్లి 10.3 డిగ్రీలు, కొత్తచెరువు 10.4 డిగ్రీలు, శెట్టూరు, గుమ్మఘట్ట 10.6 డిగ్రీలు, రాయదుర్గం, కంబదూరు 10.8 డిగ్రీలు, ఎన్పీ కుంట, కుందుర్పి, పుట్లూరు, తనకల్లు 11 డిగ్రీలు, గుత్తి, గుడిబండ 11.1 డిగ్రీలు, తాడిమర్రి 11.2 డిగ్రీలు, హిందూపురం 11.3 డిగ్రీలు, యాడికి 11.5 డిగ్రీలు, తాడిపత్రి, ఉరవకొండ, ఓడీ చెరువు, చెన్నేకొత్తపల్లి 11.6 డిగ్రీలు, లేపాక్షి, శింగనమల, నల్లచెరువు 11.7 డిగ్రీలు, విడపనకల్లు, అమడగూరు, నార్పల 11.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, మిగతా మండలాల్లోనూ 12 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

హజ్‌యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: హజ్ యాత్రకు వెళ్లాలనుకునే ముస్లింల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది జూన్, జూలైలో యాత్రకు వెళ్లాలనుకునే వారు www.hajjcommitee.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రింట్ తీసుకున్న దరఖాస్తును పూర్తి చేసి అవసరమైన పత్రాలు జతచేసి ఫిబ్రవరి 15లోపు వెబ్‌సైట్‌లో సూచించిన చిరునామాకు పంపాలని సూచించింది.

ప్రజలకు జవాబుదారీగా ఉండండి

- కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ బసంత్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 52 అర్జీలు అందాయి. కార్యక్రమం అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులకు అందిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది కచ్చితంగా హాజరయ్యేలా ఎంపీడీఓలు, కమిషనర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'స్పందన' జరిగే రోజున ఏ ఒక్క అధికారికీ సెలవు ఇవ్వరాదన్నారు. వాహనమిత్ర, నేతన్న నేస్తం, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలకు సంబంధించి ఈకేవైసీ, ఇతర ప్రక్రియలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేలకు కేటాయించిన వలంటీర్లను ఆర్బీకేల్లోనే ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలన్నారు. ఈ నెల 19, 21, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధార్‌కార్డు 100 శాతం అప్డేట్ చేయాలన్నారు. 25న ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీపీఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రభుత్వ ప్రోత్సాహంపై అవగాహన పెంచండి

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన పెంచాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీ, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ (డీఐఈపీసీ) కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటకలోని బెంగళూరు దగ్గరగా ఉండడం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి కలిసి వస్తుందన్నారు. మండల స్థాయిలో జరిగే సమావేశాల్లో పరిశ్రమల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం, ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన (పీఎంఈజీపీ) పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు తయారీ పరిశ్రమలకు రూ. 50 లక్షలు, సేవారంగ పరిశ్రమలకు రూ. 20 లక్షల రుణ సహకారం ఉందని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి షెడ్‌ల నిర్మాణానికి ఎవరైనా ముందుకు వస్తే సహకారం అందించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి గడువులోపు మంజూరు పత్రాలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, డీపీఓ విజయకుమార్, కమిటీ మెంబర్లు తిలక్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ అవార్డులు అందించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తోపుదుర్తిలో 'ఊరి దేవర'



భోజన ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తోపుదుర్తి సోదరులు

ఆత్మకూరు: 'ఏ సమస్య వచ్చినా నాకు అండగా నిలిచారు. నన్ను నమ్మి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారు. మీకు సేవ చేసే అవకాశం లభించడం నా అదృష్టం. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. మా ఇంట్లో పండుగ అంటే నియోజకవర్గంలో ప్రతి ఇంట్లో పండుగ జరిగినట్టే.. పెద్ద మనసుతో ప్రతి ఒక్కరు ఇది మన ఇంటి పండుగలా భావించి తోపుదుర్తి గ్రామంలో బుధవారం జరిగే పెద్దమ్మతల్లి గ్రామోత్సవానికి తరలిరండి.. మా ఇంట విందు చేసి వెళ్లండి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం తోపుదుర్తి గ్రామంలో 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. తోపుదుర్తి గ్రామంలో 140 సంవత్సరాల తరువాత పెద్దమ్మ తల్లి బొడ్రాయి ఊరి దేవర (గ్రామోత్సవం) జరుగుతోందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పార్టీకి సంబంధించి ఎన్నో కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించామని అన్నింటా ప్రజలు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. వారందరికీ విందు ఏర్పాటు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. దాదాపు 30 వేల మందికి పైగా భోజనాలను సిద్ధం చేయిస్తున్నట్లు వివరించారు.

ఏర్పాట్లు పూర్తి..

గ్రామోత్సవంలో భాగంగా భారీ ఎత్తున తోపుదుర్తి గ్రామంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ల ద్వారా పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. అలాగే భోజనాలు వండే చోట, భోజనాలు ఏర్పాటు చేసిన చోట టెంట్లు వేయించారు.



జ్యోతులను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు



జ్యోతుల ఉత్సవంలో భక్తజన సందోహం



కీలుగుర్రాల సందడి

కమనీయం.. జ్యోతుల మహోత్సవం

ధర్మవరం అర్బన్: తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవం చౌడేశ్వరిదేవి అమ్మవారికి సామూహిక జ్యోతుల మహోత్సవం మంగళవారం ధర్మవరం పట్టణంలో కమనీయంగా సాగింది. పట్టణంలో 23 వార్డుల్లోని చౌడేశ్వరిదేవి ఆలయాల నుంచి భక్తులు 190 వరకూ జ్యోతులను తీసుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజాము ఒంటి గంట నుంచి పాటలు పాడుతూ, భజనలు చేసుకుంటూ నృత్యాలు చేశారు. దుర్గమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించిన అనంతరం అమ్మవారి ఎదుట జ్యోతులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతుల మహోత్సవానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు హాజరయ్యారు. జ్యోతులను తలపై ఉంచుకుని దుర్గమ్మ ఆలయంలో ప్రదక్షిణ చేశారు. ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ అగ్నిగుండంలో ప్రవేశం చేసి భక్తిని చాటారు. తొగటవీర క్షత్రియుల కుల గురువు దివ్య జ్ఞానానందగిరి స్వామి జ్యోతుల మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధ్యాత్మిక సందేశం అందించారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ, గౌరవాధ్యక్షుడు గద్దం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శంకర యుగంధర్, సహాయ కార్యదర్శి గద్దం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



మృతుడు బయారెడ్డి

ఎన్పీకుంట: మండలంలోని యరవంకల వారిపల్లి గ్రామానికి చెందిన ఎస్.బయారెడ్డి (25) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన మేరకు బయారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ, సోలార్ ప్లాంట్‌లో పనులకు వెళ్లే వాడు. మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన బయారరెడ్డి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

12 మంది జూదరుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి రూ.1.73లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జూదరుల వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని కేశవనగర్ బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతూ 12 మంది పట్టుబడినట్లు వివరించారు.

మల్బరీ పంటపై విష ప్రయోగం



విష ప్రయోగంతో మృతి చెందిన పట్టుపురుగులు

రొద్దం: మండలంలోని కోగిర గ్రామానికి చెందిన రైతు కురుబ యల్లప్ప కుమారుడు గంగాధర్ సాగు చేసిన మల్బరీ పంటపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. ఈ విషయం తెలియక మేతకు వేసిన మల్బరీ ఆకును తిని 150 పట్టు పురుగులు మృతి చెందాయి. తాజా ధరతో పోల్చుకుంటే రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు గంగాధర్ తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

మన'సారా' పరివర్తన

- నాటుసారా తయారీ, విక్రయదారుల్లో మార్పునకు కొత్త పంథా
- జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తుల గుర్తింపు
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పుట్టపర్తి, కదిరి, మడకశిరలో అవగాహన సదస్సులు
- వివిధ పథకాల ద్వారా రూ.34 లక్షలతో జీవనోపాధి



పుట్టపర్తిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పెనుకొండ సెబ్ సీఐ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: సారా తయారీ, విక్రయదారుల్లో మార్పు తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. వక్రమార్గంలో వెళ్తే అవరోధాలు తప్ప ప్రయోజనం ఉండదని వివరిస్తూ వారిలో మార్పునకు అధికారులు కృషి చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు అందించి వారి జీవనోపాధుల పెంపునకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 104 మంది నాటుసారా ఉత్పత్తిదారులతో పాటు విక్రయించే వారిని ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కేసులు నమోదు కావడం వల్ల జరిగే అనర్థాలను వివరించి వారిలో మార్పు తీసుకువచ్చే చర్యలు ముమ్మరం చేశారు.

జీవనోపాధికి రుణాలు

జిల్లాలో నాటుసారాతో పాటు అక్రమ మద్యం విక్రయించే వారిలో మార్పు తెచ్చేందుకు జిల్లా యంత్రాంగంతో పాటు గ్రామీణాభివృద్ధి, పోలీసు శాఖ సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించాయి. జిల్లాలో ఉన్న 104 మందిలో ఇప్పటికే 52 మందికి రూ.30 లక్షల మేర బ్యాంక్ లింకేజీ రుణాలు అందించారు. అంతేకాక కొందరు మహిళలకు స్త్రీనిధి కింద రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. రుణాలు అందించడమే కాకుండా ఆ సొమ్మును వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన తీసుకువస్తున్నారు. పొట్టేళ్ల పెంపకం, పాడి పశువులు, టైలరింగ్, చిన్న చిన్న దుకాణాలు.. తదితర ఉపాధి మార్గాలను సూచించడమే కాక, ఏర్పాటు చేయించి వారిలో మార్పు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో మార్పు కోరుకున్న ముదిగుబ్బ మండలం గరుగు తండా నివాసి ఎం.గోపీనాయక్‌కు రూ.1.20 లక్షల బ్యాంకు రుణం ఇప్పించి గొర్రెల పెంపకాన్ని ఏర్పాటు చేశారు. దీంతో గోపీ నాయక్ కుటుంబం సంతోషంగా జీవిస్తోంది. అలాగే కదిరి సెబ్ స్టేషన్ పరిధిలోని కట్ల తండాకు చెందిన ఎం.లలితకు రూ.1.50 లక్షల రుణం మంజూరు చేయించి గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించారు. మడకశిర సెబ్ స్టేషన్ పరిధిలోని గుడిబండ మండలం జీఎస్ తండాకు చెందిన దేవరాజ్‌నాయక్‌కు బ్యాంకు ద్వారా రూ.1.50 లక్షల రుణం ఇప్పించారు. ప్రస్తుతం దేవరాజ్ నాయక్ గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

ఉపాధికి బాట

జిల్లాలో నాటుసారా విక్రయానికి స్వస్తి పలికి పరివర్తన దిశగా అడుగులు వేస్తున్న వారిని ఆర్థికంగా ప్రోత్సహించడం ఒక ఎత్తయితే.. మరోవైపు ఆయా కుటుంబాల్లో విద్యావంతులైన వారికి అర్హత ఆధారంగా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఆర్‌డీఏ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా పలు అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా చేయవచ్చని పోలీసు శాఖ భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కదిరి, మడకశిర, పుట్టపర్తిలో అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఉపాధి కల్పిస్తున్నాం



నాటుసారా తయారీ, విక్రయాల జోలికి వెళ్లకుండా మార్పు కోరుకుంటున్న వారిని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా వారికి రుణాలు ఇప్పించి జీవన స్థితిగతులు మార్చేందుకు చర్యలు తీసుకున్నాం. విద్యావంతులైన యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

– నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

మార్పు రావాలి



నాటుసారా తయారీ, విక్రయాలతో జీవితం నాశనం చేసుకోవద్దు. అక్రమ మద్యం, నాటు సారా విక్రయాల కారణంగా కేసులు నమోదైతే ఉపాధి అవకాశాలు కోల్పోతారు. ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలి. సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలి.

– కేవీఆర్‌కే ప్రసాద్, జిల్లా సెబ్ అధికారి.

సీఎం జగన్‌తో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భేటీ



పుట్టపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నియోజకవర్గంలో అత్యధికంగా జాతీయ రహదారుల మంజూరు, రికార్డు స్థాయిలో 25 వేల పక్కా గృహ నిర్మాణాలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముదిగుబ్బ మండలం మలకవేముల క్రాస్ నుంచి నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మీదుగా బాగేపల్లి వరకూ జాతీయ రహదారి ఏర్పాటుకు సహకరించాలని వినతపత్రం సమర్పించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓడీ చెరువు: మండలంలోని గజ్జికుంటపల్లితండాలో మంగళవారం ఏపీజీబీ కొండకమర్ల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఆదినారాయణ పొదుపుతో కలిగే లాభాలను వివరించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఏటీఎం, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ గురించి ప్రజలకు తెలియచేశారు. బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సందీప్, ప్రసాద్, దామోదర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తోపుదుర్తిలో ఘనంగా పెద్దమ్మ గ్రామోత్సవం



ఆంజనేయస్వామి ఆలయానికి జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఇంటి నుంచి జ్యోతులతో బయలుదేరుతున్న యువతులు, (చిత్రంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు)

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలో పెద్దమ్మ జాతర మహోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ అమ్మవారికి రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబసభ్యులు జ్యోతులు పట్టారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకూ భక్తి శ్రద్ధలతో జ్యోతులను మోసారు. అనంతరం దేవర పోతును ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి మనోరమ, సోదరులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి, చందు, తండ్రి ఆత్మారామిరెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ బోర్డు సభ్యురాలు తోపుదుర్తి నయనతారెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయం.. గందరగోళం

ఉపాధ్యాయుల సర్దుబాట్లపై విమర్శలు
- సుదూర ప్రాంతాలకు సీనియర్లు
- నగరానికి చేరువలో జూనియర్లు

- మడకశిరలోని ఓ మారుమూల ప్రాంతంలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పోస్టు సర్‌ప్లస్ అయింది. ఆయన్ని నేరుగా అనంతపురం మండల పరిధిలోని ఓ ఉన్నత పాఠశాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు.
- గుత్తి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఓ సీనియర్ ఉపాధ్యాయుడి పోస్టు రేషనలైజేషన్‌లో పోయింది. అయినప్పటికీ తాడిపత్రి మండలంలోని మారుమూల ప్రాంతానికి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. ఇలా వీరికే కాదు వందలాది మంది ఉపాధ్యాయులకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

అనంతపురం: విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయం ఉపాధ్యాయులుల్లో గందరగోళం రేపింది. ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేసిన నేపథ్యంలో సబ్జెక్టు టీచర్లు ఉండాలనే నిర్ణయంతో ప్రభుత్వం 'సర్దుబాటు' ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అర్హులైన ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్ (అడ్‌హాక్ పదోన్నతి)గా అవకాశం కల్పించింది. రేషనలైజేషన్‌లో పోస్టు పోయే ప్రమాదం ఉంటే వారికి సబ్జెక్టు కన్వర్షన్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఫిజిక్స్ బోధించే స్కూల్ అసిస్టెంట్లు ఎక్కువ మంది మేథమేటిక్స్ సబ్జెక్టు కన్వర్షన్‌కు అవకాశం దక్కించుకుని అదే స్థానాల్లో కొనసాగే ఆస్కారం ఏర్పడింది. అయితే ఇన్ని వెసులుబాట్లు కల్పించినా.. విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలు ఉపాధ్యాయుల్లో ఆందోళనకు గురి చేస్తున్నాయి.

కోరుకున్న చోటుకు జూనియర్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 652 పోస్టులు సర్‌ప్లస్‌గా ఉన్నాయి. 142 పోస్టులు కన్వర్షన్‌గా ఉన్నాయి. 191 మంది అడ్‌హాక్ పదోన్నతి పొందారు. మొత్తం 985 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ (సర్దుబాటు) చేశారు. వీరిలో 191 మంది(జూనియర్ల)కి మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా కోరుకున్న స్థానాలు కేటాయించారు. తక్కిన 794 మందికి కౌన్సెలింగ్ లేకుండా డీవైఈఓలు, ఎంఈఓలు ఇష్టానుసారంగా స్థానాలు కేటాయించారు. వీరిలో అనుకూలమైన ఉపాధ్యాయులకు మంచి స్థానాలు, అనుకూలం లేని వారికి సుదూర ప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. మొత్తం 985 మందికీ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించి ఉంటే పారదర్శకంగా ఉండేది.

అందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

అందరికీ కౌన్సెలింగ్ ద్వారానే స్థానాలు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నెల 14 నుంచి 17 వరకు నిర్వహించిన తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్–1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్ర డిమాండ్ చేస్తూ ఇన్‌చార్జ్ డీఈఓకు వినతిపత్రం అందజేశారు. సీనియార్టీ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలని ఫోర్టో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ, రాష్ట్ర ముఖ్య సలహాదారు గాండ్లపర్తి శివానందరెడ్డి కోరారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

- సర్‌ప్లస్, కన్వర్షన్‌లో అన్యాయం జరిగి ఉంటే లిఖితపూర్వకంగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య తెలిపారు.

రిమాండ్‌కు ఘరానా మోసగాళ్లు

- నకిలీ డాక్యుమెంట్లతో రూ. 60 లక్షల విలువైన ప్లాటు కాజేసే యత్నం
- ముఠా గుట్టును రట్టు చేసిన అనంతపురం రూరల్ పోలీసులు
- ఎనిమిది మంది అరెస్ట్
- నిందితుల్లో టీడీపీ నేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయభాస్కరగౌడ్

రాప్తాడు రూరల్: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.60 లక్షల విలువైన ప్లాటును కొట్టేయాలనుకునే ముఠా గుట్టును అనంతపురం రూరల్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను మంగళవారం అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విజయభాస్కరగౌడ్ వెల్లడించారు.

పట్టుబడింది వీరే...

పోలీసులకు పట్టుబడిన వారిలో ఉరవకొండ మండలం వెలిగొండకు చెందిన యర్రలాలెప్ప గారి శేఖర్, సయ్యద్ మహమ్మద్ రఫీ అలియాస్ రఫీ, రేనిమాకులపల్లికి చెందిన చిన్న ఎర్రిస్వామి అలియాస్ సింహ, ముష్టూరు నివాసి వడ్డే శివ, అనంతపురం నగరానికి చెందిన ఎరికల గంగమ్మ అలియాస్ గుగ్గిళ్ల గంగమ్మ, కొత్తోళ్ల పార్వతి, దేవిరెడ్డి ప్రతాపరెడ్డి, బత్తల హారికాభవానీ ఉన్నారు.

ప్రైవేట్ సర్వేయర్ కీలకం

ఉరవకొండకు చెందిన ఎస్.మహమ్మద్ రఫీ ప్రైవేట్ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. నకిలీపత్రాలు సృష్టించి భూములు, ప్లాట్లు కాజేయడంలో ఇతను సిద్ధహస్తుడు. గతేడాది అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలోని సర్వే నంబర్ 133–3 పొలంలో పాత లేఔట్‌లో ఇంటి ప్లాటు కోసం సర్వే చేపట్టాడు. ఆ సమయంలో అక్కడున్న 6 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్లాటు వివరాలు సేకరించాడు. ఆ ప్లాటును యజమాని శివయ్య, అతని కుటుంబ సభ్యులెవరూ పట్టించుకోలేదని తెలుసుకున్న రఫీ... రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నకలు పత్రాలు సేకరించాడు.

నకిలీలను తీసుకొచ్చి

నకలు పత్రాలతో ప్లాటు విక్రయానికి సిద్ధమైన రఫీ.. అనంతపురానికి చెందిన పార్వతమ్మను కలిసి తనకు సహకరించాలని కోరాడు. ఆమె ద్వారా అనంతపురానికి చెందిన సుల్తాన్, గంగమ్మ, కవితను కలిసి వీరిలో ఒకరిని ప్లాటు అసలు యజమాని శివయ్య కుమారుడు ముత్తుమారన్‌గా, భార్య గంగమ్మ, కుమార్తె సాయికుమారిగా నటించేందుకు ఒప్పించాడు. ఇందు కోసం వారికి డబ్బు ఆశ చూపాడు. వీరి ముగ్గురి ఆధార్ కార్డుల్లోని ఫొటోలు, ఆధార్ నంబర్లు అలాగే ఉంచి చిరునామాలు మాత్రం హైదరాబాద్ పేరుతో తన ల్యాప్‌టాప్ ద్వారా మార్ఫింగ్ చేసి ప్రింట్ తీశాడు. శివయ్య ఫ్యామిలీ సర్టిఫికెట్, కూతురు సుజాత డెత్ సర్టిఫికెట్ కూడా బోగస్‌వి సృష్టించాడు.

రూ.15 లక్షలు అడ్వాన్స్

నకలు పత్రాలు, నకిలీ యజమానులను సిద్ధం చేసుకున్న తర్వాత ప్లాటు విక్రయానికి సహకరించాలంటూ తనకు తెలిసిన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు శేఖర్ చిన్న ఎర్రిస్వామి, వడ్డే శివను సంప్రదించాడు. దీంతో వారి సహకారంతో 2022, అక్టోబరు 22న అనంతపురంలోని తారకరామారావు నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణకు సెంటు రూ.10 లక్షలతో ఆరు సెంట్ల ప్లాటుకు రూ.60 లక్షల బేరం కుదుర్చుకున్నారు. రూ.15 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని అగ్రిమెంటు రాసి, నకిలీ ఓనర్లతో సంతకాలు చేయించారు. సదరు ప్లాటుకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్లు కావాలని లక్ష్మీనారాయణ అడగడంతో తెచ్చిస్తామంటూ నమ్మబలికారు.

ఒరిజినల్ డాక్యుమెంటు తయారీ ఇలా...

ప్లాటుకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంటు తయారు చేసేందుకు రఫీ మరో పన్నాగం పన్నాడు. పార్వతమ్మకు తెలిసిన ప్రతాప్‌రెడ్డి ద్వారా పాత స్టాంప్ పేపర్లు, రబ్బరు సీళ్లు తయారు చేయించి, పార్వతమ్మ మనువరాలు హారికభవానీ చేత పాత స్టాంప్ పేపర్లపై కలరు జిరాక్స్ డాక్యుమెంట్‌లో ఉన్న మేటర్ అంతా సంతకాలతో సహా బాల్‌పాయింట్ పెన్‌తో రాయించారు. సీళ్లు వేసి సదరు డాక్యుమెంటును ఒరిజనల్ డాక్యుమెంట్‌గా చూపుతూ నకిలీ ఓనరు అయిన ముత్తుమారన్ అలియాస్ సుల్తాన్ ద్వారా లక్ష్మీనారాయణకు ఇప్పించారు. డాక్యుమెంటును పరిశీలించిన లక్ష్మీనారాయణ అది నకిలీదని గుర్తించి తనకు ప్లాటు వద్దు, తన డబ్బు వెనక్కు ఇవ్వాలని గొడవపడ్డాడు. నిందితులు త్వరలో ఇస్తామని చెప్పి, ముఖం చాటేయడంతో ఈ నెల 12న అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం అనంతపురంలోని బళ్లారి రోడ్డు సమీపంలో ఉన్న సత్యదేవనగర్‌లో పార్వతమ్మ ఇంటివద్ద నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నిందితుల్లో టీడీపీ నేత

పోలీసులకు పట్టుబడిన వారిలో రేనిమాకులపల్లికి చెందిన బోయ చిన్న ఎర్రిస్వామి అలియాస్ సింహ.. ఉరవకొండ ప్రాంతంలో టీడీపీ నేతగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుగా పోటీ చేసి ఓడిపోయాడు. ఎర్రిస్వామికి అన్ని విధాలుగా టీడీపీ ఉరవకొండ నియోజకవర్గ నేత అండదండలు ఉన్నట్లు సమాచారం. ఆయనే పెట్టుబడులు పెడుతూ లిటిగెంట్, తకరారు ప్లాట్లను చిన్న ఎర్రిస్వామితో కొనుగోలు చేయించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం



ఉట్ల మాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

నల్లమాడ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మసకవంకపల్లిలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఉట్ల పరుష, పార్వేట ఉత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, అంజినాయక్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉట్టి(టెంకాయ) కొట్టేందుకు, ఉట్లమాను ఎక్కేందుకు, పార్వేటలో కుందేలును పట్టుకునేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మసకవంకపల్లి, మూలప్పగారిపల్లి, డి.చెర్లోపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీధర్‌బాబు, నాయకులు తమటం సుధాకర్, జరిపిటి రవీంద్ర, నారాయణస్వామి, మునెప్ప, రామచంద్ర, గోవిందు, శ్రీనివాసులు, కులశేఖర తదితరులు పాల్గొన్నారు.